కాకర్లవలస గిరిజనులపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని మిర్తి వలస పంచాయతీ కాకర్లవలస గిరిజనులపై సెక్షన్107 ప్రకారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తహశీల్దార్ అజురఫీజాన్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ పార్కు పనులకు ఆటంకం కలిగించడం, తరచూ ఆ ప్రాంతంలో వివాదాలు సృష్టించడంతో 25 మంది గిరిజనులపై బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. సుమారు వంద మీటర్లలోపు గుంపులుగా గుమిగూడినా, వివాదాలు సృష్టించినా క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. మేరకు గిరిజనులకు నోటీసులు స్థానిక పోలీస్ స్టేషన్ ద్వారా పంపిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఇ పార్కుకు తమ సాగు భూములను లాక్కోవద్దని గిరిజనులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో అధికారులు ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు.

ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోతున్న

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ • కలెక్టరేట్ వద్ద డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫ్రీ బస్సు పథకం వలన నష్టపోతున్న ఆటో,క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎన్‌పిఆర్ భవనం నుంచికలెక్టరేట్ వరకు ఆటో, క్యాబ్ డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి అమలు చేయనున్న ఫ్రీ బస్సు పథకం వలన రాష్ట్రవ్యాప్తంగా, విజయనగరం జిల్లాలో స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో,క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. కరోనా అనంతరం ఆర్థికంగా దెబ్బతిన్న ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలు నేటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా తమ సొంత పెట్టుబడితో ఒక పక్క ఫైనాన్స్ చెల్లించుకుంటూ మరోవైపు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రోడ్ టాక్స్, గ్రీన్ టాక్స్,రెన్యువల్, పొల్యూషన్ వంటి పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో,క్యాబ్ డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో కార్పొరేట్ సంస్థలైన రాపిడో, ఉబర్, ఓలా వంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం వలన ఆటో,క్యాబ్ డ్రైవర్లు ఉపాధి దెబ్బ తింటుందన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేల నుంచి రూ.15 వేలకు పెంచుతామన్న కూటమి ప్రభుత్వ హామీ నేటికీ నెరవేరలేదదన్నారు. రవాణా రంగ కార్మికులు అందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని లోకేష్ ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలను తాము స్వాగతిస్తున్నామని, అదే సందర్భంలో ఆ పథకం వల్ల నష్టపోతున్న వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతి అందజేశారు. లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌నూ ఆదుకోవాలని, అచ్యుతాపురం వద్ద ఉన్న ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, పోలీసుల వేధింపులు ఆపాలని కోరారు. స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వానికి రాసి పంపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ,యూనియన్ నాయకులు పాపారావు, కూర్మారావు, సూర్యనారాయణ, అప్పారావు, రామారావు, దాలినాయుడు, అప్పలనాయుడు, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, చందు, వెంకట్రావు, పైడిరాజు, ఆనంద్, రాంబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటో, క్యాబ్ డ్రైవర్లు

15 నాటికి 50వేల బంగారు కుటుంబాల దత్తత

భారీ వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్/కోట

ఈనెల 15 నాటికి 50వేల బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పి 4 కార్యక్రమం, హర్ ఘర్ తిరంగా, సీజనల్ వ్యాధులు, భారీ వర్షాలు తదితర అంశాలపై ఆన్‌లైన్ సమావేశం ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొదట 67,066 బంగారు కుటుంబాలను గుర్తించగా, వడపోతల అనంతరం ఆ సంఖ్య 60,612 కు తగ్గిందని కలెక్టర్ చెప్పారు. ఇంకా ఎవరైనా అనర్హులు ఉంటే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 15 నాటికి జిల్లాలో 50వేల బంగారు కుటుంబాల దత్తతను పూర్తిచేయాల్సి ఉందని, ఇప్పటివరకు 37,150 కుటుంబాలకు ఈ ప్రక్రియను పూర్తి చేశారని తెలిపారు. ఈ మూడు రోజుల్లో మిగిలిన వారి దత్తత ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

రానున్న నాలుగు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ నుంచి సూచనలు వచ్చాయని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, మండలాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అదుపు చేయాలని, వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం గురించి డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు, టూరిజం అధికారి కుమారస్వామి వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందాలి

శివారు భూములకు సైతం సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, నీటిపారుదల అధికారులను కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లాలో పంటల స్థితిగతులు, సాగునీటి సరఫరా, వర్షపాతం తదితర అంశాలపై తమ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 60 శాతం సాగు విస్తీర్ణానికి కాలువల ద్వారా సాగునీరు అందుతోందని, మిగిలిన 40శాతం సాగుభూములు వర్షాలపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీటిమట్టం సంతృప్తికరంగానే ఉందని, ఈ ఏడాది పంటలకు ఇబ్బంది ఉండకపోవచ్చని అన్నారు. తోటపల్లి ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేసేటప్పుడు, శివారు ప్రాంతాలకు సైతం నీరు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇఇని ఆదేశించారు. గత రెండు నెలల్లో జిల్లాలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడం వలన వర్షాధార భూములకు ప్రస్తుతం కొంత ఇబ్బంది ఏర్పడిందని చెప్పారు. ఈ వారంలో వర్షాలు పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల మేరకు వర్షాలు పడితే, ఆ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని అన్నారు. జిల్లాలో ఖరీఫ్ లో సాధారణ వరి సాగు విస్తీర్ణం 91,214 హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 44,231 హెక్టార్లలో ఉబాలు జరిగాయని తెలిపారు. ఖరీఫ్ లో అన్ని పంటలు కలిపి సాధారణ సాగు విస్తీర్ణం 1,16,993 హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 61,922 సాగు అయ్యాయని తెలిపారు. ప్రస్తుతానికి రైతాంగం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ప్రస్తుత సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు కూడా జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి సిహెచ్.చంద్రశేఖర్, తోటపల్లి ఇఇ పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

తిరంగ ర్యాలీలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి, జనసేన నాయకులు యశస్విని

దేశభక్తిని చాటి చెప్పాలి

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

దేశభక్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపడుతున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుండి గంటస్తంభం వరకు జాతీయ పతాక ర్యాలీని సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ సమైక్యతను చాటి చెపుతూ ఆగస్ట్ 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడు భాగస్వామ్యం అవుతూ జిల్లాలో ప్రతి ఇంటి పైన మువ్వన్నెల జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. విజన్ 2047 సంకల్పంతో ప్రతి ఒక్కరూ దేశం కోసం రాష్ట్రం కోసం పాటుపడాలని, భారత దేశాన్ని అగ్రరాజ్యాల వరుసలో నిలబెట్టాలని విజ్ఞప్తిచేశారు. కోట వద్ద నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా సెల్ఫీ స్టాండ్ లో జాతీయ జెండా చేబట్టుకొని మంత్రి సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతి రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్విని, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య , పర్యాటక అధికారి కుమార స్వామి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సంగీత కళాశాల ఆధ్వర్యాన

విజయనగరం కోట : హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ కార్యక్రమాన్ని స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ మండపాక నాగలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలోపలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా సెల్ఫీపాయింట్ ప్రారంభం

దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో, హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లో సెల్ఫీ పాయింట్ ఏర్పాటయ్యింది. ఈ సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సోమవారం ప్రారంభించారు. జాతీయ జెండాను చేతబట్టి జిల్లా కలెక్టర్ సెల్ఫీ దిగారు. జిల్లా పర్యాటకాధికారి కుమారస్వామి పాల్గొన్నారు.

15 నుంచి ఉచిత బస్సు ఏర్పాట్లు

- జీరో టికెట్టుతో మహిళల ప్రయాణం
- సహనం, సమన్వయం పాటించాలి
- ప్రజారవాణా అధికారి వరలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళల శక్తిని బలోపేతం చేయడానికి స్త్రీ శక్తి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15నుంచి ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందని జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి జి.వరలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో డిపిటిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 15న రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీశక్తి పథకం ప్రారంభమవుతుందని తెలిపారు. మహిళల ప్రయాణానికి జిల్లాలో 137 బస్సులను వినియోగిస్తామన్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, బస్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు జీరో టిక్కెట్‌తో ప్రయాణం చేస్తారని తెలిపారు. స్పెషల్ సర్వీసులు, నాన్ స్టాప్ , సూపర్ డీలక్స్, డీలక్స్ బస్సులు ఈ పథకానికి వర్తించవని తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా సూపర్‌వైజర్లును, ఆఫీసర్లను షిఫ్ట్ వైజ్‌గా వినియోగిస్తామని తెలిపారు. ఆధార్, ఓటర్ ఐడి, రేషన్ కార్డులతో ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. మహిళలంతా అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో విజయనగరం డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, సిఐ సుమిత్ర, ఎంఎస్‌పి ప్రకాష్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

సిబ్బంది సమస్యలను దృష్టిలో ఉంచుకొని స్త్రీ శక్తి పథకానికి తగు ఏర్పాట్లు చేయాలని ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ప్రజా రవాణా అధికారికి గుడివాడ వరలక్ష్మిని కోరారు. ప్రధానంగా ప్రతి బస్సుకూ చార్జర్స్ ఏర్పాటు చేయాలని, బస్సులకు హైడ్రాలిక్ లింక్‌డోర్లు పెట్టాలని, డ్రైవర్లకు, కండక్టర్లకు టికెట్ చెకింగ్ విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాములు, అధ్యక్షులు సిహెచ్ వెంకటరావు, డిపో అధ్యక్షులు ఎస్‌కె రఫీ, జెఎస్ నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రజారవాణా అధికారికి వినతిస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ప్రభుత్వ స్థలాలు, భూముల రీ సర్వే : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ స్థలాలు, భూముల రీ సర్వే చేయించుకోవాలని పలు శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ సూచించారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం అధికారులతో మాట్లాడుతూ గ్రామాల , ప్రభుత్వ భూముల, సంస్థల, అతుకుబడి భూములు, సరిహద్దులను నిర్ణయించడానికి నవంబర్ లోగా రీ సర్వే జరపనున్నట్లు తెలిపారు. రెవిన్యూ, దేవాదాయ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు, పంచాయతీ, భూ సేకరణ అధికారులు, పంచాయతీరాజ్ , ఆర్‌అండ్‌బి జిల్లా రిజిస్ట్రార్, మైనారిటీ శాఖ ల అధికారులు భూముల్ని రీ సర్వే చేసుకొని సరిహద్దులను నిర్ణయించుకోవాలని, మ్యుటేషన్లు చేయించుకోవాలని తెలిపారు.

వంగరలోని కెజిబివి పాఠశాల

వంగర కెజిబివికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-వంగర

జిల్లాలోని వంగర మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం రాష్ట్రస్థాయి 'ఉత్తమ పాఠశాల అవార్డు' పొందింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 352 కెజిబివిలలో, విద్యార్థుల శాతం, వార్షిక హాజరు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సరాసరి మార్కులు, ఇతర నాణ్యత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసినటాప్ 10 పాఠశాలల్లో వంగర కెజిబివి ఒకటిగా నిలిచింది. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు సాధించిన అత్యధిక ఉత్తీర్ణతశాతం, గరిష్టంగా వచ్చిన గణాంకాల ఆధారంగా ఈ గుర్తింపు లభించింది. ఈనేపథ్యంలో, వంగర కెజిబివి ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆగస్టు 15వతేదీన నిర్వహించనున్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి విజయవాడ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖమంత్రి లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందజేయ నున్నారు. అవార్డు రావడం పట్ల పాఠశాల సిబ్బందిని, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అభినందించారు. పాఠశాల సిబ్బందితని డిఇఒ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టుసమన్వయకర్త ఎ.రామారావు అభినందించారు.

14న జిల్లా సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 14న జిల్లా సమీక్షా సమావేశం (డిఆర్‌సి) జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి వంగలపూడి అనిత, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. నీటిపారుదల, వ్యవసాయం, అనుబంధ శాఖలు, వైద్య ఆరోగ్యం, త్రాగునీటి సరఫరా తదితర కీలక శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించి, తగు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

నేడు నులిపురుగుల నివారణా దినం

విద్యా సంస్థల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ జరగాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఆర్ఎస్ అనంతరం నేషనల్ డే వార్మింగ్ డే ఐఇసి పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 ఏళ్ల మధ్య పిల్లలు, విద్యార్థులు 3,60,000 పై బడి ఉన్నారని, వీరందరికీ అల్బెండజోల్ మాత్రలు ఒకే రోజున మధ్యాహ్న భోజనం చేసిన అర గంట తర్వాత మింగించాలని తెలిపారు. 1 నుండి 2 ఏళ్ళ వారికీ అల్బెండజోల్ -400 అర ముక్క వేయాలని, 2 నుండి 19 ఏళ్ళ వరకు ఒక పూర్తి మాత్ర వేయాలని తెలిపారు. ఐసిడిఎస్, అన్ని పాఠశాలలు, కెజిబివిలు, సంక్షేమ హాస్టళ్లు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నిక్ తదితర 4857 విద్యాసంస్థల్లో ఈ మాత్రల వినియోగం జరగాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఎంహెచ్ఒ డాక్టర్ జీవనరాణి, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల దొంగలు గద్దె దిగాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఎంఎల్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిజెపి పాలిత రాష్ట్రాల్లో రహస్య ఎజెండాలు అమలు చేసి, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ సిపిఐ ఎం ఎల్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు బెహరా శంకరరావు మాట్లాడుతూ అధికారం కోసం బిజెపి రకరకాల అడ్డదారులు తొక్కుతుందన్నారున్నారు. బీహార్‌లో ఎన్నికలకు ముందు స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ పేరుతో ప్రతిపక్షాలకు చెందిన 64 లక్షలు ఓట్లు ను ఓటరు జాబితా నుంచి తొలగిస్తూ ముసాయిదా తయారు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో అడ్డదారులు తొక్కుతున్న వారు గద్దె దిగాలని, ఎస్ఐ ఆర్ ను నిలిపివేయాలి డిమాండ్ చేశారు. ధర్నాలో పార్టీ నాయకులు ఏం.అప్పలరాజు, గిరి ప్రసాద్, సత్యారావు, పైడిరాజు, కనకరావు, గౌతమి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వినతులు పరిష్కరించకుంటే చర్యలు : కలెక్టర్

పిజిఆర్ఎస్ కు 149 వినతులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్ లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. సోమవారం పిజిఅర్ఎస్‌లో కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 149 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 52వినతులు అందాయి.

మా ఇళ్ల స్థలాలు మాకు అప్పగించండి

విజయనగరంటౌన్ : ఎస్.కోట మండలం వెంకటరమణ పేట పంచాయతీలో గల కొండమల్లి పూడి గ్రామ గిరిజనులు తమ ఇళ్ల స్థలాలు తమకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గాడి అప్పారావు మాట్లాడుతూ కొండమల్లి పూడి గిరిజనులకు 1999లో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, పాత ఇళ్ల స్థానంలో పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ఎల్ పి సి ఇవ్వాలని మండల రెవెన్యూ అధికారిని ఎన్ని సార్లు కలిసి విన్నవించినా ఇవ్వడం లేదన్నారు. కలెక్టర్ కలుగజేసుకుని ఎల్‌పిసి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు.

మా భూములు మాకు అప్పగించండి

సర్వే నంబరు 146-6 లో మేము సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న మా 33 ఎకరాల భూమి, ఇళ్లు తమకు అప్పగించాలని కోరుతూ కిల్తంపాలెం పంచాయతీ దెప్పూరు గ్రామ గిరిజనులు కోరారు. తాముంటున్న ఇళ్లు, సాగు చేస్తున్న భూమి జిందాల్‌కు అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యిందని తెలిపారు. దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో గిరిజనలు లగుడు శంకరరావు, లగుడు సన్యాసిరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో భార్యభర్తలు హల్‌చల్

కలెక్టరేట్‌లో బొండపల్లి మండలం అంబటివలసకు చెందిన కోరాడ సాయికుమార్, రాజేశ్వరి దంపతులు హల్‌చల్ చేశారు. తమకు మోడీ, ట్రంప్ కలలోకి వచ్చి తాము నివాసముంటున్నజగన్న కాలనీలో ఈశ్వరుడి గుడి కట్టాలని చెప్పారని, ఈ విషయం చెప్పేందుకు కలెక్టర్ వద్దకు వస్తే ఆయనను కలిసేందుకు అనుమతివ్వడం లేదంటూ పెద్ద పెద్ద కేకలు వేశారు. అదే సమయంలో కలెక్టర్ అంబేద్కర్ సమావేశ మందిరంలోకి వెళ్తుండగా వారిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సైతం వారిని పక్కకు నెట్టకపోవడంతో వారిపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లోపల ఉన్న పోలీసు అవుట్ పోస్టు సిఐ వైకుంతరావు, వన్ టౌన్ ఎస్సై ప్రసన్నకుమార్లు అక్కడికి వచ్చి స్టేషన్‌కు తరలించారు. .

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్నకొండమల్లిపూడి గిరిజనులు

జిల్లా హోటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం జిల్లా హోటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం ఘనంగా జరిగింది. అధ్యక్షులుగా పిఎస్ఎన్ రావు (వాసు), కార్యదర్శిగా సునీల్ కుమార్, కోశాధికారి గా గ్రంధి చైతన్య, పలువురు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు. వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో పనిచేయాలని కోరారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులు జి.బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసగించడంలో చంద్రబాబు దిట్ట

మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విమర్శించారు. సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించి వాటిలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేకపోతున్నారని విమర్శించారు. ఈనెల 15న అమలు చేస్తామన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా తూతూ మంత్రంగా అమలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే తల్లికివందనం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్‌ల పథకాలను అసంపూర్ణంగా అమలు చేస్తున్న వైనాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. ప్రధానంగా మహిళలను నమ్మించి మోసం చేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా మారిందన్నారు. అన్ని బస్సుల్లో ఎటువంటి షరతులు లేకుండా ఉచితంగా ప్రయణానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలోని మహిళల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్‌లు ఆల్తి సత్యకుమార్, పిన్నింటి కళావతి, జిల్లా పార్టీ కార్యదర్శి దుప్పాడ సునీత, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బాధితుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పివకుల్ జిందల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. మొత్తం 37 ఫిర్యాదులు అందగా భూ తగాదాలకు సంబంధించి 16 ఉన్నాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

నేర నియంత్రణే లక్ష్యంగా కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని కొత్తవలసలో సోమవారం తెల్లవారు జామున ఐదు గంటల నుంచి 8 గంటల వరకు గజపతినగరం సిఐ జివి రమణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది నేర నియంత్రణే లక్ష్యంగా గ్రామంలో ఉన్న ప్రతి ఇంట్లో, బహిరంగ ప్రదేశాల్లో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రమణ మాట్లాడుతూ గ్రామాల్లో నేర నియంత్రణ లక్ష్యంగా ఈ సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో నాటు తుపాకీలతో హత్యలు జరుగుతున్న సంఘటన దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఎవరి వద్ద నాటు తుపాకీలు, మారణాయుధాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎవరి దగ్గరైనా నాటు తుపాకీలు ఉంటే స్వచ్ఛందంగా తమకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. కిరణ్ కుమార్ నాయుడు, సర్కిల్ పరిధిలో ఉన్న ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని నాతవలస గ్రామంలో స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో నాటు తుపాకులు ఏరివేతే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. లైసెన్స్ లేకుండా తుపాకుల వినియోగించడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. గంజాయి సారా నాటు తుపాకులు లభ్యమైతే వారిపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఎస్ఐ బి.గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు స్థానిక ఎరుకుల వీధి, కొండవెలగాడ, సీతారామునిపేట, గొర్లిపేట గ్రామాల్లో సోమవారం కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ అనధికార నాటు తుపాకులు ఉన్న అనుమానిత గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. చట్ట విరుద్ధంగా నాటు తుపాకులు, ఇతర లైసెన్స్ లేని గన్స్ వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గజపతినగరం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాష్ట్ర స్థాయి పోటీలకు 44 మందికి అర్హత

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగర జిల్లా యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌ను అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ శశిభూషణరావు ఆధ్వర్యాన నిర్వహించారు. పోటీల్లో 100కి పైగా క్రీడాకారులు 6 వయసు విభాగాలలో 10 ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. వీరిలో 44 మంది స్వర్ణ పతకాలు సాధించి రాబోయే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మూర్తి, రాష్ట్ర సంఘం కార్యనిర్వాహక సభ్యులు సిహెచ్. సుధ పర్యవేక్షించారు. బహుమతి ప్రదాన కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పూర్వ డిఇఒ ఎస్. అరుణ కుమారి, ఎంపిడిఒ జి.భాస్కర్, జాతీయ కూచిపూడి కళాకారిణి వి.రమణకుమారి, చిన్నయి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వడ్లమాని మధుసూదనరావు పాల్గొన్నారు

వచ్చేనెల 14న కళా సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14న కళా సంబరాలు నిర్వహిస్తున్నట్లు అకాడమీ వ్యవస్థాపకుడు పి.భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో నిస్వార్థంగా సేవలందించిన వారికి విశిష్ట వ్యక్తుల అవార్డులు ప్రదానం చేస్తామన్నారు. సమాజ సేవకులు, కళాకారులు తదితర రంగాల వారు ఈ అవార్డు లకు దరఖాస్తు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్టీ రామారావు, దాసరి నారాయణరావులు తెలుగు సినీ పరిశ్రమకు అందించిన సేవలు నేటి తరానికి తెలియాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. సెప్టెంబరు 14న విశాఖ డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డు గ్రహీతలను సన్మానిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9848481767 నెంబర్ కు సంప్రదించాలని కోరారు.

కార్యకర్తకు రూ.25వేల ఆర్థిక సాయం

గంట్యాడ : బొండపల్లి మండలం బి.రాజేరు గ్రామానికి చెందిన జనసేన క్రియాశీల సభ్యుడు సంతోష్ ఇటీవల ఆకస్మికంగా మరణించడంతో ఆయనకు గంట్యాడ, బొండపల్లి జనసేన నాయకులు సోమవారం రూ.25వేలు నగదు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ, బొండపల్లి జనసేన నాయకులు బమ్మిడి ఎర్నాయుడు, ఎం.ప్రశాంత్, లండా గౌరీ నాయుడు, బమ్మిడి ఎల్లారావు, అడపా రాంబాబు, ఆర్జి ఎర్నా యుడు, జోగినాయుడు, సత్యనారాయణ, సతీష్, వి.సత్యనారాయణ, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని జాకేరు ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. తరగతి గదులు, పరిశీలించిన అనంతరం విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎ 1 తెలుగు పరీక్షను పరిశీలించారు. ఎస్ఎస్‌మెంట్ బుక్‌లెట్‌ను విద్యార్థులకు ఇచ్చేముందు క్షుణ్ణంగా పరిశీలించి ఇవ్వాలని, నింపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలుంటే ఆఫీస్‌ను సంప్రదించాలని కోరారు.

బొబ్బిలిని మన్యం జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మత్స ఆనందకుమార్, ఉపాధ్యక్షులు రుంకాన ప్రసాద్ డిమాండ్ చేశారు. బొబ్బిలి బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా దూరంగా ఉన్న విజయనగరంలో బొబ్బిలి నియోజకవర్గాన్ని కలపడం వల్ల పాలన పరమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, బొబ్బిలికి దగ్గరలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో కాలపాలని కోరారు. బొబ్బిలి కోర్టు పరిధిలో 9మండలాలు ఉన్నాయని, పార్వతీపురం జిలాల్లో బొబ్బిలిని కలిపితే సామాన్యులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి బొబ్బిలి నియోజకవర్గాన్ని పార్వతీపురం మన్యం జిల్లాలో కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు సహకరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్‌మిల్ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి సహకరించాలని 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన రిటైర్డ్ జ్యూట్ కార్మికులతో కలిసి ఎపి మార్క్ ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజుకు గ్రాడ్యూటీ చెల్లింపులపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ రిటైర్డ్ కార్మికులు గ్రాడ్యూటీ చెల్లించాలని లేబర్ కోర్టును ఆశ్రయించగా కోర్టు గ్రాడ్యూటీ తక్షణమే చెల్లించాలని జ్యూట్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసిందన్నారు. అయితే జ్యూట్ యాజమాన్యం మాత్రం సంవత్సరాలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో జిల్లా కలెక్టర్‌ని కూడా కలిశామన్నారు. రెవెన్యూ అధికార్లు కూడా జ్యూట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. మార్క్ ఫెడ్ ఛైర్మన్‌గా చొరవ తీసుకొని రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో పలువురు రిటైర్డ్ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పింఛనుదార్ల కార్యవర్గం ఎన్నిక

నెల్లిమర్ల : ప్రభుత్వం పింఛన్ దార్ల నెల్లిమర్ల తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక సోమవారం స్థానిక ప్రభుత్వ పింఛన్‌దార్ల సంఘం భవనంలో నిర్వహించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా కెల్ల చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శిగా బొమ్మన ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా నల్లా సోమరాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సంఘం నుంచి జమ్ము చిన్నంనాయుడు, ఆర్.బ్రహ్మానందం, సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగినట్లు ప్రధాన కార్యదర్శి బొమ్మన ఈశ్వరరావు తెలిపారు.

టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు కోరారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అప్పగించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఛైర్మన్ రాంబార్కి శరత్‌బాబుకు మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లను పూర్తి చేయకపోవడంతో పట్టణ పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్లను అప్పగించకపోయిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల నుంచి బలవంతంగా లోన్ రికవరీ చేయడం అన్యాయమన్నారు. ఇళ్లను పూర్తి చేయాలని, లోన్ రికవరీ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యన్నదానానికి గురుదేవ్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన సత్రంలో సోమవారం నాటికి 2,557 రోజులు పూర్తయినట్లు సామాజిక సేవా కార్యకర్త పాలూరు సిద్ధార్థ తెలిపారు. కొత్తవలస మండలానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం తన తల్లి రాపర్తి సుబ్బలక్ష్మి వర్ధంతి సందర్భంగా అనాథ పేద వృద్ధులకు అన్నదానంతో పాటు వస్త్ర దానం చేశారు. తమ సత్రంలో నిరుపేదల వృద్ధులకు దాతల సహకారంతో మూడు పూటల భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సందర్భంగా సిద్ధార్థ ఆయనకు తెలిపారు. పేద వృద్ధులను ఆదుకునేందుకు దాతలు సహకారానికి 9618961868కు సంప్రదించాలని సిద్ధార్థ కోరారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా రాజశేఖర్

వంగర : మండల ఇంఛార్జి తహశీల్దారుగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిబ్బంది అంతా అంకితభావంతో పని చేసి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బోనెల రామారావు, కూర్మాన నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉపకార వేతనం దరఖాస్తులకు గడువు పెంపు

బాడంగి: వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రెజీబీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా విజయనగరం, పార్వతీపురం, మన్యం, శ్రీకాకుళం జిల్లాలో గల అమ్మా నాన్న లేని ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు వారి విద్యావసరాలు నిమిత్తం నెలకు 1000 రూపాయలు చొప్పున వారు డిగ్రీ పూర్తి చేసేవరకు ఉపకారవేతనం ఇవ్వనున్నారు. వీటి కోసం దరఖాస్తులు చేసుకునే వారి కోసం ఈ నెల 15వరకూ గడువు పెంచారు. దరఖాస్తులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ద్వారా చేసుకోవాలని బాడంగి జడ్పీ పాఠశాల స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కొల్లి ఈశ్వరరావు తెలిపారు.

12 టన్నుల యూరియా పంపిణీ

వేపాడ : మండలంలోని సింగరాయి రైతు సేవా కేంద్రంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, సర్పంచ్ నిరుజోగి వెంకటరావు చేతుల మీదుగా సోమవారం రాయితీపై వచ్చిన 12 టన్నుల యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అరిగిపాలెం నాయకులు ఎంపిటిసి తొండవరపు వెంకటరమణ, మాజీ ఎంపిటిసి దుల్ల వెంకటరావు, నీటి సంఘం అధ్యక్షుడు నిరుజోగి అమ్మతల్లినాయుడు, వ్యవసాయ సహాయకులు ఎం. శివరాం తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జెడ్‌పి ఛైర్మన్ పరామర్శ

తెర్లాం : ఇటీవల అనారోగ్యం కారణంగా డి.గదబవలస ఎంపిటిసి బెవర వెంకట శేషగిరి తల్లి, మాజీ సర్పంచ్ వాళ్లపల్లి చిన్నం నాయుడు మృతి చెందారు. ఈనేపథ్యంలో జెడ్‌పి ఛైర్మన్,వైసిపిజిల్లా అధ్యక్షులు మజ్జిశ్రీనివాసరావు బెవర వెంకట శేషగిరి, వాళ్లపల్లి చిన్నం నాయుడు ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కూటమి మోసాలను తెలుసుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంటకచినప్పల నాయుడు అన్నారు. సోమవారం ఆయన మున్సిపాలిటీలోని ఐటిఐ కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ ఇంటి గోపాలరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క సంవత్సర కాలంలోనే ప్రజలు విసిగిచెందారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎస్.జి.పేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు వివరించారు. చంద్రబాబు ఎన్నికలు ముందు ఇచ్చిన మేనిఫెస్టో గుర్తు చేశారు. మానిఫెస్టోలో ఇచ్చిన పథకాలు ప్రజలకి ఈ ఏడాది రాకపోవటం వల్ల ఎంత నష్టపోయారో వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, నాయకులు వాకాడ రాంబాబు, పోతనపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, గోగాడ శ్రీను, గేదెల నాయుడు, గోగాడ అప్పారావు ఎల్ఐసి, ఆర్‌నాయుడు, చలుమూరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని రామస్వామి పేట, కేజీపూడి, పికెఆర్‌పురం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటరావు, నాయకులు మెరుపుల సత్యనారాయణ, సోంపురం సర్పంచ్ గంగరాజు, ఉగ్గిన శ్రీను, స్వర్ణపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ ఛైర్మన్లు నారాయణ, శంకరరావు, వెంకటరావు

పలు పిఎసిఎస్‌లకు అధ్యక్షులు నియామకం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని నాలుగు కోఆపరేటివ్ సొసైటీల్లో మూడు సొసైటీలకు నూతన కార్యవర్గం ఎన్నికైంది. పెంట శ్రీరాంపురం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా కరక నారాయణ, సభ్యులుగా బర్ల భాస్కరరావు, గులిపల్లి అవతారం, లక్కిడాం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా చుక్క వెంకటరావు, సభ్యులుగా కిలపర్తి పరదేశినాయుడు, ఏనుగుల త్రినాధరావు, బోనంగి కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా గోపిశెట్టి శంకర్రావు, సభ్యులుగా గంగ్రేటి సత్యం, గుడిసెట్టి దేవుడు బాబులు నూతనంగా ఎన్నికయ్యారు. గంట్యాడ కోపరేటివ్ సొసైటీకి ఎన్నిక జరగాల్సి ఉంది.

నేడు డీవార్మింగ్ డే

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 12న జాతీయ పురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలని వైద్యాధికారులు డాక్టర్ ఎస్ చలమయ్య, రీనా చౌదరి కోరారు. ఈ మేరకు బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో 44 పాఠశాలల్లోను, 43 అంగన్వాడీ కేంద్రాల్లోనూ ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు పిల్లలు, కిషోర్ బాలలకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైద్య సిబ్బందికి పంపిణీ సూచనలు, సలహాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ టి.రాధాకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.శివరామకృష్ణ, డాక్టర్ అనూష తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల పిల్లల్లో నులిపురుగులు, రక్తహీనత నివారించవచ్చునన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు సగం మాత్ర 3 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర వేయాలన్నారు. డెంకాడ పిహెచ్‌సి పరిధిలో 5,360 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నులి పురుగుల నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ యేసయ్య, హెల్త్ సూపర్‌వైజర్ గురు భక్తులు, ఏఎన్ఎమ్స్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తిరుమల నర్సింగ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - చీపురుపల్లి

హర్ ఘర్ తిరంగా ర్యాలీ మండల పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి ఆర్‌డిఒ, ఎంపిడిఒ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది జాతీయ పతాకాలతో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలురువు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయతను చాటేందుకు ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ సచివాలయం నుంచి స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వరకూ సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఇంచార్జ్ ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర దినోత్సవం వేడుకల్లో పాల్గొనాలని, ప్రతి ఒక్కరికీ దేశభక్తి కలిగి ఉండాలని, ప్రతి ఇంటిపై ఆరోజు జాతీయ జెండా రెపరెపలాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడి ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఆనవరంలో సోమవారం విలేజ్ క్లినిక్‌ను ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోనే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం విలేజ్ క్లినిక్లను ఏర్పాటు చేసిందన్నారు. విలేజ్ క్లినిక్ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవి, వైస్ ఎంపిపి సింగిరెడ్డి భాస్కరరావు, సర్పంచ్ వాకాడ వెంకటనాయుడు, మాజీ ఎంపిపి బొంతు త్రినాథ, పిఎసిఎస్ ఛైర్మన్ లచ్చుపతుల సత్యం, టిడిపి నాయకులు ఏగిరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిలోనే రేషన్ సరుకులు ఇవ్వండి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

తమకు తమ ఊరిలోనే రేషన్ సరుకులు తీసుకొనే సదుపాయం కల్పించాలని బూడిపేట యువత కోరారు. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేసే వారిని, కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కొత్త పాలసీ ద్వారా పాత విధానాన్ని తీసుకొని రావడంతో తాము రేషన్ సరుకులు తీసుకోవడానికి పొలం గట్లపై 2 కిలోమీటర్ల నడిచి పక్క ఊర్లో తీసుకోవాల్సి వస్తుందని బూడిపేట ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యువత సోమవారం తహశీల్దార్ రత్నం కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ తమ గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో తమతో పాటు వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ గ్రామానికి పంచాయతీ హోదా లేకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా దావలపేట పంచాయతీలో ఉందని, దీని వల్ల ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాలసీ విధానం ద్వారా రేషన్ సరుకులు కోసం దావలపేట వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, అందువల్ల తమకు నెలలో మొదటి వారంలో కనీసం ఒక్కరోజు తమ గ్రామం వద్ద రేషన్ సరుకులు తీసుకుని సదుపాయం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూడి అచ్చం నాయుడు, మజ్జి పైడిరాజు, తమ్మినేని కేశవరావు, రవి, చందక రామస్వామి పాల్గొన్నారు.

భూ దోపిడీ ఆపాలని నిరసన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని బొడ్డవరలో జరుగుతున్న జిందాల్ నిర్వాసితుల శాంతియుత నిరసన 51వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎంపిపి సండి సోమేశ్వరరావు మాట్లాడుతూ, జిందాల్ కంపెనీ, ప్రభుత్వం కలసి ఆదివాసీల భూములను బలవంతంగా దోచుకుంటూ భూ దోపిడీకి పాల్పడుతున్న తీరును వెంటనే ఆపాలన్నారు. జిందాల్ కంపెనీ దోపిడీ, మోసాలు, ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే తమ ఒకతరం భవిష్యత్తు నాశనం అయిందని, ఇక ఈతరం గిరిజన పిల్లల భవిష్యత్తు కూడా చీకట్లోకి నెట్టివేయబడుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 51 రోజులుగా శాంతియుతంగా నిర్వాసిత రైతుల గోడును చెబుతున్నా ప్రభుత్వం, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరూ ఇటువైపు చూసే పరిస్థితి లేదని ఇది ఏ విధమైన ప్రజాస్వామ్యం? అని ప్రశ్నించారు. జిందాల్ కంపెనీ, ప్రభుత్వం చేతులు కలిపి గిరిజనుల జీవన హక్కులను తుంగలో తొక్కుతున్నారని, జిందాల్‌కు భూములు ఇచ్చిన గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకూ భూమి తిరిగి వచ్చే వరకూ, ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, జిందాల్ నిర్వాసిత ఆదివాసి రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి : జెడి

ప్రజాశక్తి- డెంకాడ (భోగాపురం)

ఆదర్శ పాఠశాలల విద్యాభివృద్ధికి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ తెహరా సుల్తానా అన్నారు. మండల కేంద్రంలోని పిఎంశ్రీ ఎపి ఆదర్శ పాఠశాలలో 6 జిల్లల్లో ఉన్న 35 ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆమె అవగాహన సదస్సును సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల పనితీరు, తరగతులు నిర్వహణ, విద్యార్థుల ప్రమాణాలను మెరుగు పర్చే విధంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించి పరీక్షలు, సిలబస్, విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై రివ్యూ నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మమేకమై ఉపాధ్యాయుల బోధన తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జోన్ 1 రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, ఎంఇఒ బాలిపల్లి చంద్రమౌళి, ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న బెహరా సుల్తానా

ఇ- పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో ఈపంట నమోదు చేసుకోవాలని ఎఒ అమరా శివ సూచించారు. ఇ-పంట వల్ల వల్ల పెట్టుబడి సాయం, వడ్డీ రుణాలు, అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతన్నలకు నష్టపరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 1780 హెక్టార్లలో వరి విస్తీర్ణం ఉండగా ఇప్పటికే 510 హెక్టార్లలోనే ఉభాలు జరిగాయని తెలిపారు. మరొకవారం రోజులపాటు వర్షాలు లేకపోతే ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు రైతులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఎస్‌సి హోదా కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని కోరుతూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్ మరియు వివిధ దళిత ఆదివాసి మైనారిటీ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో వినతి అందజేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బవిరెడ్డి శంకరరావు, డిబిఎస్‌యు జిల్లా నాయకుడు ఎమ్.పి.రాజు మాట్లాడుతూ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ ఇచ్చిన రిపోర్టును తక్షణమే అమలు చేయాలని అన్నారు. దళిత క్రైస్తవులపై వివక్షత చూపడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. వి.మహేష్, కె.పి.రాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

కెరటాంలో హత్య?

ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని కెరటాం గ్రామంలో శనివారం రాత్రి మేనమామ నెడుగంటి అప్పలకృష్ణ (45)ను తన మేనల్లుడు నారపాటి సాయి హత్య చేసినట్లు అనుమానాలు రావటంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సోమవారం సాయంత్రం ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. కెరటాంలోని హరిజనవాడకు చెందిన నేడుగంటి అప్పలకృష్ణ భార్య రాజుకు తన మేనల్లుడు సాయికి మధ్య వివాహేతర సంబంధం గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతుంది. పలుమార్లు ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గతేడాది కాలంగా మృతుడు ఇంట్లోనే నారపాటి సాయి ఉంటున్నాడు. అప్పలకృష్ణ మరణంపై మేనల్లుడు సాయిపై గ్రామస్తులకు అనుమానం రావటంతో మృతుని బంధువు పిల్లి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశాం. ఈ మేరకు సోమవారం తాహశీల్దారు డి.రాజేశ్వరరావు సమక్షంలో శవపేటికలో ఖననం చేసిన మతదేహాన్ని బయటకు తీసి కెరటాంలోనే గజపతినగరం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. కాగా ఇప్పటికే హత్యకు పాల్పిడినట్లు అనుమానిస్తున్న నారపాటి సాయి కోసం గాలిస్తున్నామని తెలిపారు

పోక్సో కేసులో 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లాలోని గుర్ల పోలీసు స్టేషనులో 2022 సంవత్సరంలో .లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు గుర్ల మండలం, పెనుబర్తి గ్రామానికి చెందిన గుడిశ సూర్యనారాయణ (23)కు పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 3వేలులు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. గుర్ల మండలంలో నివాసం ఉంటున్న 16ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతూ, చదువుపై ఆసక్తి లేకపోవడం వల్ల ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయినట్లుగా తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై గర్ల్ మిస్సింగు కేసును గుర్ల పోలీసులు నమోదు చేసారు. అనంతరం, బాలిక ఆచూకీ లభ్యం కావడం, విచారణలో తనను నిందితుడు గుడిశ సూర్యనారాయణ ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు గురి చేసి, అత్యాచారానికి పాల్పడినట్లుగా తెలపడంతో అప్పటి ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పోక్సో కేసుగా మార్పు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతరం, మహిళా పిఎస్ డిఎస్‌పి టి.త్రినాధ్ "నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితురాలికి రూ. 2లక్షల పరిహారం మంజూరు చేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

గంజాయి కేసులో ఇద్దరికి రెండేళ్ల జైలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

2వ పట్టణ పోలీసు స్టేషనులో 2024లో నమోదైన గంజాయి కేసులో ఇద్దరు నిందితులకు 2ఏళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధిస్తూ విజయనగరం 1వ ఎ.డి. జె. జడ్జి ఎం.మీనాదేవి సోమవారం వెల్లడించారు. నగరంలోని శ్రీనివాసనగర్‌లో కోమటి చెరువు వద్ద నగరానికి చెందిన ఇమంది ఎల్లయ్య (26), బోని యూసఫ్ (25) నుంచి 3.1 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు. సిఐ టి.శ్రీనివాస రావు వారిని రిమాండుకు తరలించి, నిందితులపై అభియోగ పత్రం దాఖలు చేసారు. నేరం రుజువు కావడంతో జైలు శిక్ష పడింది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విడతల వారీగా పరిష్కరించాలని ఎపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోషియేషన్ సాలూరు యూనిట్ అధ్యక్షులు చొక్కాపు శ్రీరాములునాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిందని ఇప్పటికైనా పెండింగ్ బకాయిలు, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. సరండర్ లీవ్స్, ఏపిజిఎల్ లోన్స్ పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల దృష్ట్యా వీటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. తాము ఈ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం గుంకలాం చెరువు సమీపం బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. బొండపల్లి మండలం కెరటాం గ్రామానికి చెందిన బి.సాయి (21) బైకు పై బైపాస్ రొడ్డుగుండా ప్రయాణం చేస్తుండగా గుంకలాం చెరువు వద్దకు వచ్చే సరికి గేదె అడ్డుగా రావడంతో ఢీ కొన్నాడు. దీంతో గేదె అక్కడిక్కడే మృతి చెందగా సాయికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు 108కు సమాచారం అందించడంతో జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. విజయనగరం రూరల్ ఎస్.ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి-బొబ్బిలి

మద్యం తాగి వాహనాన్ని నడిపిన ముగ్గురు మందుబాబులకు బొబ్బిలి కోర్టు జరిమానా విధించినట్లు పట్టణ సిఐ కె.సతీశ్ కుమార్ చెప్పారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి హేమ స్రవంతి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున ఫైన్ వేసినట్లు వెల్లడించారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండల కేంద్రంలోని విశాఖ అరకు రోడ్డులో ఎస్ఐ సిహెచ్ నవీన్ పడాల్ సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఎస్‌కోట విశాఖ మధ్య లక్కవరపుకోట ప్రధాని రహదారి వద్ద ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. అరుకు టూరిజం వల్ల జులాయిగ తిరిగే కుర్రకారు మద్యం తాగి అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం తాగి వాహనం నడిపే వారిని పట్టుకొని కేసు నమోదు చేసి అనంతరం వారిని కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. పాత కేసుల చలానా రికవరీ లు చేశామన్నారు. త్రిబుల్ రైడింగ్ చేసే వారిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎపిజిఇఎ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా ఆసుపత్రుల సముదాయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బలివాడ బాల భాస్కరరావు, ఉపాధ్యక్షులు బాలాజీ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM O.S.115/2022

Between:
Sri Jasti Vishnuvardhana Rao ...Plaintiff

And:
Sri Bangaru Suryanarayana & others ...Defendants

SUMMONS

To,
D-6: Sri Bangaru Ramu,
S/o. Late Appala Konda, Hindu, aged 32 years, R/at D.No.1-10, Relli Village, Kothavalasa Mandal, Vizianagaram District.

Please take notice that the above named plaintiff filed the above suit seeking a direction to the defendants for recovery of amount and for other reliefs and in the said suit though the summons were sent to you many a time through Court and R.P., but you have intentionally avoided to receive the same and the Hon'ble Court was pleased to issue notice through this paper publication. Therefore, please take notice that the above matter stands posted to **25-08-2025** for your appearance. You have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.

V.S. PAVAN,
Advocate
Visakhapatnam.
Cell: 9848119594